క్లుప్తంగా

బీజేపీ గెలుపునకు కృషి చేద్దాం



కమిటీ సమావేశంలో పాల్గొన్న బీజేపీ నాయకులు

గిద్దలూరు రూరల్: బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి గెలుపునకు ప్రతి ఒక్కరం కలిసి కృషి చేద్దామని నూతనంగా ఎన్నికైన శక్తి కేంద్ర బూత్ కమిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి పిడతల రమేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రామాంజనేయులు, చంద్రమోహన్, కనకరావు, మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

110 మందికి వైద్య పరీక్షలు

కంభం: అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో లాయర్ మల్లిఖార్జున రావు సహకారంతో శుక్రవారం స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కిమ్స్ హాస్పిటల్ వైద్యుడు డా.క్రిష్ణారెడ్డి, వైద్య బృందంతో కలసి 110 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. వైద్యశిబిరానికి వచ్చిన రోగుల్లో అవసరమైన వారికి షుగరు, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ప్రభాకర్, ఉదయగిరి మల్లిఖార్జున, ఆలయ కమిటీ వారు పాల్గొన్నారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

బేస్తవారిపేట: మండలంలోని సలకలవీడులో రామలింగేశ్వర స్వామి శివలింగ విగ్రహ ప్రతిష్ఠ శుక్రవారం వేదపండితుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. శయ్యాధివాస ఉద్వాసనం, విగ్రహ మూర్తులకు స్నపన, కళాన్యాసం, కళాహోమం, విశేష హోమాలు, శివపార్వతుల కళ్యాణం, మహాపూర్ణాహుతి, మహాకుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు మధ్యాహ్నం అన్నదానం చేశారు.

కలెక్టర్‌ను కలిసిన తాళ్లూరు ఎంపీపీ

తాళ్లూరు: కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్‌ను తాళ్లూరు ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు శుక్రవారం ఒంగోలులో కలిశారు. మండలంలోని పలు అభివృద్ధి పనుల మంజూరు, తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు.

ఆలయాల నిర్మాణానికి భూమి పూజ

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల గ్రామంలో గంగమ్మతల్లి, పోలేరమ్మతల్లి ఆలయాల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ పూజారి ఉప్పుటూరి పిచ్చయ్యశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్ఛరణలతో భూమి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలి

మార్కాపురం: జగనన్న కాలనీల్లో స్థలాలు పొందిన వారు వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ టి.చందన సూచించారు. శుక్రవారం రాయవరంలోని జగనన్న కాలనీ లేఔట్‌లో లబ్ధిదారులతో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులు గృహాలు నిర్మించుకునేలా ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వలంటీర్లు చైతన్యపరచాలని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఎం రమేష్‌బాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రతాప్‌రెడ్డి, హౌసింగ్ ఏఈ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

మార్కాపురం టౌన్: పట్టణ పరిధిలోని ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మున్సిపల్ చైర్మన్ చిర్లంచెర్ల బాలమురళీకృష్ణ పేర్కొన్నారు. శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగంలో పనిచేస్తున్న 42 మంది కార్మికులకు దుస్తులు, సబ్బులు, కొబ్బరినూనె, చెప్పులు అందజేశారు. పట్టణ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో కమిషనర్ గిరికుమార్, డీఈ సుబానీ, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రసూల్ పాల్గొన్నారు.

గాయపడిన విద్యార్థికి డీఈవో పరామర్శ



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో విజయభాస్కర్

ముండ్లమూరు: మండలంలోని మారెళ్ల ప్రభుత్వ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న విట్సన్ పాల్‌ను డీఈవో విజయభాస్కర్ శుక్రవారం హైస్కూల్‌లో పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలడిగి తెలుసుకున్నారు. పాఠశాల వద్ద కాలు జారి ప్రమాదవశాత్తూ పడటంతో గాయాలైనట్లు విద్యార్థి తెలిపాడు. పాఠశాల హెచ్‌ఎం పురుషోత్తమరావుతో డీఈవో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. పదో తరగతిలో ఉత్తమ ఫలితాల సాధనకు తీసుకుంటున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌ను సన్మానించిన మాజీ ఎంపీపీ



జెడ్పీ చైర్‌పర్సన్, మాజీ ఎమ్మెల్యేని సన్మానిస్తున్న మాజీ ఎంపీపీలు, వైఎస్సార్ సీపీ నాయకులు

తాళ్లూరు: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని మాజీ ఎంపీపీ గోళ్లపాటి మోషే దంపతులు, కుటుంబ సభ్యులు శుక్రవారం ఘనంగా సన్మానించారు. మాజీ ఎంపీపీ స్వగ్రామమైన రమణాలవారిపాలెంలో శుక్రవారం జరిగిన శుభ కార్యక్రమానికి బూచేపల్లి వెంకాయమ్మ, శివప్రసాద్‌రెడ్డి హాజరైన సందర్భంగా వారిని సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోఆప్షన్ మెంబర్ షేక్ ఆదాం షరీఫ్ (బుజ్జి), మాజీ ఎంపీపీలు పోశం మధుసూదనరెడ్డి, ఇత్తడి దేవదానం, జిల్లా సంయుక్త కార్యదర్శి ఐ.వెంకట సుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ డైరెక్టర్ గుజ్జుల యోగిరెడ్డి, సర్పంచ్‌లు కేవీఎస్ వెంకట రామిరెడ్డి, మందా శ్యామ్సన్, జిల్లా యూత్ కార్యదర్శి జక్కుల రామక్రిష్ణ, సొసైటీ మాజీ చైర్మన్ కుమ్మిత నాగిరెడ్డి, తిరుపతిరెడ్డి, కుమ్మిత శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా జిల్లా పరిషత్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు.

అదానీ ఆస్తులు జప్తు చేసి జాతీయం చేయాలి



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

దర్శి: అదానీ ఆస్తులు జప్తు చేసి జాతీయం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి మాడపాకుల రమేష్‌బాబు డిమాండ్ చేశారు. గౌతమ్ అదానీ ఆస్తులను జప్తు చేయాలని కోరుతూ స్థానిక స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఎదుట శుక్రవారం సీపీఐ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ దేశంలో అతి పెద్ద సంస్థయిన ఎల్‌ఐసీలు అదానీ కంపెనీలలో 60 శాతానికిపైగా షేర్లు కొనుగోలు చేయగా, 80 శాతానికిపైగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా షేర్లు కొనుగోలు చేయడమే కాకుండా ఈ రెండు సంస్థలు రూ.80 వేల కోట్ల పైచిలుకు అదానీ కంపెనీలకు అప్పుగా ఇచ్చాయన్నారు. పేదవాడు ఇల్లు కట్టుకోవడానికి, పిల్లల చదువులకు అప్పు అడిగితే ఇవ్వని బ్యాంక్‌లు అదానీ, అంబానీలకు ఎలా అప్పులిస్తున్నాయని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కోటంశెట్టి హనుమంతరావు, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆర్.కరుణానిధి, సీపీఐ పట్టణ కార్యదర్శి జూపల్లి కోటేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగూల్‌మీరా

కురిచేడు: ఎమ్మెల్సీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న నేపథ్యంలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని తహసీల్దార్ షేక్ నాగూల్‌మీరా తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో రాజకీయ పార్టీల నాయకులు, అధికారులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగూల్‌మీరా మాట్లాడుతూ మండలంలో ఫ్లెక్సీలు తొలగించాలని, విగ్రహాలకు ముసుగులు ధరించాలని సూచించారు. మండలంలోని అధికారులందరూ సమష్టిగా పనిచేస్తేనే మండలానికి మంచిపేరు వస్తుందని ఎంపీడీవో వీ భవ్య అన్నారు. మండలంలో ఎటువంటి ప్రచారాలు నిర్వహించాలన్నా ముందుగా పోలీసులకు సమాచారమిచ్చి అనుమతి పొందాలని ఎస్సై దేవకుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎంఈవో వస్త్రాంనాయక్, బీజేపీ, సీపీఎం, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

జగనన్న కాలనీలను సందర్శించిన డీపీవో



జగనన్న కాలనీలో ఇళ్లను పరిశీలిస్తున్న డీపీవో నారాయణరెడ్డి

దొనకొండ: మండలంలోని దొనకొండ పంచాయతీలో జగనన్న కాలనీలో లబ్ధిదారులు నిర్మించుకుంటున్న ఇళ్లను జిల్లా పంచాయతీ అధికారి (డీపీవో) జీవీ నారాయణరెడ్డి శుక్రవారం పరిశీలించారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమంలో భాగంగా పర్యటించిన డీపీవో.. గృహాల లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. లబ్ధిదారులంతా వెంటనే గృహాలు నిర్మించుకోవాలని డీపీవో సూచించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించి విద్యార్థులకు అందించే మెనూను పరిశీలించారు. పంచాయతీ కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. గ్రామాన్ని పచ్చగా ఉంచాల్సిన బాధ్యత మీదేనని సూచించారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో కొబ్బరి బోండాలు విక్రయిస్తున్న యజమానులతో మాట్లాడి తాగి పడేసిన కొబ్బరి బోండాలను ఎక్కడ పడితే అక్కడ వేయరాదని ఆదేశించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా కాలువల్లో పూడిక తీయించాలని పంచాయతీ కార్యదర్శి పి.క్రిష్ణమూర్తికి సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వి.వసంతరావునాయక్, ఈవోఆర్డీ ఎస్.డేవిడ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

రాబోయే సీజన్‌లో మరిన్ని సేవలందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

దర్శి: రాబోయే వ్యవసాయ సీజన్‌లో మరిన్ని సేవలు అందించాలని కృష్ణ మండలి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం లాం గుంటూరు సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ జీ సుబ్బారావు సూచించారు. స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన శాస్త్రీయ సలహామండలి సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత సంవత్సరంలో శాస్త్రవేత్తలు వారి విభాగాలలో చేపట్టిన క్షేత్రస్థాయి పరిశీలనను, ప్రథమశ్రేణి ప్రదర్శన క్షేత్రాలను సందర్శించి ఫలితాలను పరిశీలించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో చేపట్టబోయే కార్యక్రమాలపై ముందస్తు ప్రణాళికలతో సిద్ధం కావాలని సూచించారు. డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ డాక్టర్ బీ ముకుందరావు మాట్లాడుతూ ప్రణాళికతో ముందుకుపోతే అన్ని రంగాల్లో విజయం సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు ప్రమీలారావు, వివిధ శాఖల అధికారులు వెంకటరమణ, నిర్మల, ఆదిరెడ్డి, కేవీకే శాస్త్రవేత్తలు ఎంఉష, ఎం.జాహ్నవి, ఎం.శివ, టీ వెంకటేశ్వరరెడ్డి, ఎం.లీలాకృష్ణ పాల్గొన్నారు.

రైతులు ఈకేవైసీ చేయించుకోవాలి



మాట్లాడుతున్న ఏఓ శ్రీనివాసులు

మార్కాపురం టౌన్: రబీ సీజన్‌లో పంటలు సాగు చేసిన రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని ఏఓ డి.శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ.. ఆర్‌బీకే సిబ్బంది ప్రస్తుతం పత్తి పంట వేసే రైతులను దృష్టిలో పెట్టుకుని వారికి అవసరమైన ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. వ్యాపారులు పురుగు మందుల కొరతను సృష్టించి ఎంఆర్‌పీ కంటే ఎక్కువకు అమ్మితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. పశు వైద్యాధికారి లీనాగ్రేస్ మాట్లాడుతూ.. టీఎంఆర్ దాణా 200 కేజీలు 1300 రూపాయలకు ఆర్‌బీకేలలో అందుబాటులో ఉందని తెలిపారు. కిసాన్ క్రెడిట్ కార్డు ఉన్న రైతులకు గేదెల కొనుగోలు కోసం బ్యాంకులు పావలా వడ్డీకే రుణాలు ఇస్తున్నాయని తెలిపారు. కార్యక్రమంలో సలహా మండలి సభ్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలి



ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న భానుమతి

పొదిలి రూరల్: పోలీసులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా పోలీసు వింగ్ మెడికల్ ఆఫీసర్ భానుమతి సూచించారు. శుక్రవారం పొదిలి సర్కిల్ పరిధిలోని పొదిలి, కొనకనమిట్ల, తర్లుపాడు, మర్రిపూడి పోలీసులకు మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసు అధికారులు, సిబ్బందికి ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. మెడికల్ క్యాంప్‌లో పాల్గొన్న పోలీసులందరికీ వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో పొదిలి సీఐ సుధాకర్, కొనకనమిట్ల, తర్లుపాడు ఎస్సైలు దీపిక, ముక్కంటి, ఏఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్‌తో నాయకుల విగ్రహాలకు ముసుగు



వైఎస్సార్ విగ్రహానికి ముసుగు కప్పిస్తున్న అధికారులు

యర్రగొండపాలెం: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ శుక్రవారం నుంచి అమల్లోకి రావడంతో రాజకీయ నాయకుల విగ్రహాలకు ముసుగు వేశారు. రాజకీయ పార్టీల నాయకులు వివిధ సందర్భాల్లో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించారు. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ రవీంద్రరెడ్డి, ఎంపీడీఓ రంగసుబ్బరాయుడు, ఈవోఆర్డీ రాజశేఖరరెడ్డి, ట్రాఫిక్ ఎస్సై శ్రీనివాసమూర్తి పర్యవేక్షించారు.

నేడు వైపాలెంలో మంత్రి సురేష్ పర్యటన

యర్రగొండపాలెం: రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ శనివారం యర్రగొండపాలెంలో పర్యటిస్తారు. ఈ మేరకు స్థానిక డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబూ జగ్జీవన్‌రాం ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ఏర్పాటు చేసిన గ్రామ, వార్డు సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఆయన పాల్గొంటారని మంత్రి కార్యాలయం శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

విద్యుత్ సర్వీసులు తనిఖీ చేసిన విజిలెన్స్ అధికారులు

కంభం: మండలంలో శుక్రవారం విజిలెన్స్ అధికారులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ అధికారిణి టీ హేమావతి ఆధ్వర్యంలో 35 బృందాలుగా ఏర్పడి 3255 సర్వీసులు తనిఖీలు నిర్వహించారు. అదనంగా లోడు వాడుతున్న సర్వీసులు గుర్తించి వారికి రూ.1,62,500 అపరాధ రుసుం విధించారు. అదే విధంగా విద్యుత్ చౌర్యానికి పాల్పడుతున్న 11 మందిని గుర్తించి వారికి రూ.20 వేలు జరిమానా విధించారు. తనిఖీల్లో డీఈ బాల అంకయ్య, మార్కాపురం డివిజన్‌లోని డీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆహార భద్రతను కాపాడే బాధ్యత రైతులదే

తాళ్లూరు: ఆహార భద్రతను కాపాడే బాధ్యత రైతులపై ఉందని వ్యవసాయాధికారి ప్రసాదరావు అన్నారు. శుక్రవారం స్థానికంగా నిర్వహించిన మండలస్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతుల పొలాల్లో పది శాతం చిరుధాన్యాలు సాగు చేసి వాటినే తిని ఆరోగ్యంగా ఉండాలని కోరారు. చిరుధాన్యాల ప్రయోజనాలు, మార్కెట్‌లో వాటికి ఉన్న డిమాండ్‌ను వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

యర్రగొండపాలెం: మండలంలోని రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏఈ శ్రీనివాసులు తెలిపారు. అయ్యంబొట్లపల్లి, బోయలపల్లి సబ్‌స్టేషన్లలో మరమ్మతు పనులు చేపడుతున్నందున ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తామని శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

బీజేపీ తాళ్లూరు మండల కమిటీ ఎన్నిక

తాళ్లూరు: భారతీయ జనతా పార్టీ తాళ్లూరు మండల నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా అనుమల కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సారెడ్డి కోటేశ్వరరావు, రత్నాచారి, ప్రధాన కార్యదర్శిగా వేమిరెడ్డి సుబ్బారెడ్డి, జాయింట్ సెక్రటరీగా సారెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చందోలు రామారావు, మారం గోవిందరెడ్డి, కిసాన్ యువమోర్చా అధ్యక్షులుగా పులి శ్రీనివాసరెడ్డి, కార్యదర్శిగా లక్క వెంకటేశ్వరరెడ్డి, ఎస్సీ మోర్చా అధ్యక్షునిగా గోగుల కోటయ్య, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా తేలుకుట్ల రజనిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

బీజేపీ పట్టభద్ర అభ్యర్థిని బలపరచండి

దొనకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రుల అభ్యర్థిగా బీజేపీ బలపరిచిన సన్నారెడ్డి దయాకరరెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిండి నారాయణరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలో సుడిగాలి పర్యటన చేసి పట్టభద్రులకు కరపత్రాలు అందజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాడపాకుల శ్రీనివాసులు, మండల అధ్యక్షుడు చీర్ల వెంకటేశ్వర్లు, దర్శి పట్టణ ప్రధానకార్యదర్శి చల్లా వెలుగొండయ్య పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం నేరం



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

దర్శి: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ శాఖ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టీ శ్రీనివాసరావు అన్నారు. దర్శి విద్యుత్ ఈఈ ఎస్‌ఏ కరీ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. 40 మంది అధికారులు, 95 మంది సిబ్బంది 3,104 సర్వీసులను తనిఖీ చేశారు. అదనపు లోడు వాడుతున్న 71 మందికి రూ.3.10 లక్షల అపరాధ రుసుం విధించారు. అనుమతించిన కేటగిరీకి మించి విద్యుత్ వాడుతున్న ఆరుగురికి రూ.18 వేలు అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యుత్ చౌర్యానికి పాల్పడితే మొదటి తప్పిదానికి కాంపౌండ్ పద్ధతిలో అపరాధ రుసుం విధిస్తామని చెప్పారు. రెండోసారి తప్పిదం చేస్తే అరెస్ట్ చేస్తామన్నారు. విద్యుత్ చౌర్యంపై వాట్సాప్ లేదా నేరుగా సమాచారాన్ని 8331019980 నంబరుకు తెలియజేస్తే తగు చర్యలు తీసుకుంటామని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు. కార్యక్రమంలో ఆపరేషన్ దర్శి, పొదిలి, చీమకుర్తి డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు కే పిచ్చయ్య, కే శ్రీనివాసరెడ్డి, ఏ గురునాథరావు, ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే లైసెన్స్ రద్దు



పుచ్చకాయలపల్లెలో ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న ఏఓ బుజ్జిబాయి

పెద్దారవీడు: అధిక ధరలకు రసాయన మందులు విక్రయిస్తే దుకాణం లైసెన్స్ రద్దు చేయడంతోపాటు సీజ్ చేస్తామని ఏఓ బుజ్జిబాయి హెచ్చరించారు. మండలంలోని పుచ్చకాయలపల్లె గ్రామంలో రైతు భరోసా కేంద్రం, ఈ క్రాప్ నమోదు, ఎరువుల దుకాణాన్ని శుక్రవారం పరిశీలించారు. ఏఓ మాట్లాడుతూ.. మండలంలో ఎక్స్‌పోనూస్ కంపెనీ పురుగు మందు ఎమ్మార్పీ కంటే అధిక ధరకు షాపు యజమానులు విక్రయిస్తున్నారని తన దృష్టికి వచ్చిందని చెప్పారు. నిబంధనలు అతిక్రమిస్తే వ్యాపారులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మూడు రోజుల్లోగా ఈ క్రాప్, ఈకేవైసీ పూర్తి చేయించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో బాషా, వీఏఏ లాలూనాయక్, రైతులు పాల్గొన్నారు.

నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ



రథం వద్ద పూజలు చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పొదిలి రూరల్: పొదిలి పార్వతీ సమేత నిర్మమహేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభమయ్యాయి. తొలి రోజు అంకురార్పణ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం రథం అలంకరణలో భాగంగా మరమ్మతు పనులను ఆలయ పాలక మండలి ఆధ్వర్యంలో ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ యక్కలి శేషగిరిరావు, ఈఓ శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి సానికొమ్ము శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దుగ్గెంపూడి శ్రీనివాసరెడ్డి, జిల్లా కార్యదర్శి గొలమారి చెన్నారెడ్డి, కల్లం సుబ్బారెడ్డి, పార్టీ మాజీ కన్వీనర్ జి.శ్రీనివాసులు, గూడూరి వినోద్, అంబవరపు నారాయణరెడ్డి, పేరం కోదండరామిరెడ్డి, రెడ్డిబోయిన వెంకటేశ్వర్లు, వాకా సుబ్బారెడ్డి, దొర్నాల నారాయణరెడ్డి, కొత్తూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల పక్కా గృహాలకు సహకారం

- సంఘం తండా గిరిజనులకు హామీ ఇచ్చిన వైఎస్సార్ సీపీ నేత పిచ్చయ్య



సంఘం తండ గిరిజనులకు అధికారుల ఎదుట హామీ ఇస్తున్న ఆర్‌వీ పిచ్చయ్య

త్రిపురాంతకం: మండలంలోని సంఘం తండా గిరిజనులు పక్కా గృహాలు నిర్మించుకోవడానికి ఆర్థిక సహకారం అందిస్తానని వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య హామీ ఇచ్చారు. తండాలోని 35 మందికి ప్రభుత్వం ఇళ్లు మంజూరు చేయగా ఆర్థిక సమస్యల కారణంగా నిర్మాణ పనులు ప్రారంభించలేదు. శుక్రవారం తండాలోని జగనన్న కాలనీ లేఔట్‌ను ఎంపీడీఓ మరియదాస్, ఈఓఆర్డీ మురళీమోహన్‌తో కలిసి పిచ్చయ్య పరిశీలించారు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి మంజూరు చేసిన నిధులకు తోడు మరికొంత మొత్తాన్ని తన సొంత నిధులు నుంచి అందిస్తానని అధికారుల సమక్షంలో హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తండా వాసులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ ఆశయం నెరవేరాలి



గృహ లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ప్రసాదరావు

కొనకనమిట్ల: జగనన్న కాలనీల్లో నివేశన స్థలాలు పొందిన వారు త్వరగతిన ఇంటి నిర్మాణాలు పూర్తి చేసి ప్రభుత్వ ఆశయం నెరవేరేలా చూడాలని తహసీల్దార్ కేవీఆర్‌వీ ప్రసాదరావు, ఎంపీడీఓ జనార్దన్ సూచించారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని గొట్లగట్టులో జగనన్న కాలనీ లేఔట్లను పరిశీలించారు. ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులతోపాటు, ఇంకా పనులు చేపట్టని వారితో సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీలో నీటి వసతి, విద్యుత్ సౌకర్యం కల్పించామని, వేగంగా ఇళ్లు నిర్మించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ ఉడుముల కాశిరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పెద వెంకటయ్య, వీఆర్‌ఓ దిలీప్ కుమార్, కార్యదర్శి ప్రసాద్, ఏపీఎం గోపాలకృష్ణారెడ్డి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ బాలునాయక్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ గీత పాల్గొన్నారు.

సాగర్ కాలువ స్నాన ఘట్టాల వద్ద భద్రత ఏర్పాట్లు



సాగర్ కాలువ స్నాన ఘట్టాల వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: మహాశివరాత్రి మహోత్సవాల్లో భాగంగా త్రిపురాంతకం ఆలయాల సమీపంలోని సాగర్ కాలువ స్నాన ఘట్టాల వద్ద అధికారులు పనులు ప్రారంభించారు. త్రిపురాంతకం ఆలయాలకు వచ్చే భక్తులు సాగర్ కాలువలో స్నానాలు చేస్తుంటారు. ఈ నేపథ్యంలో అక్కడ ప్రమాదాలు సంభవించకుండా మెట్ల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయడంతోపాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. కాలువ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. పనులు వేగంగా పూర్తి చేస్తున్నట్లు ఎన్‌ఎస్పీ ఏఈ నీలిమ, ఈఓఆర్డీ మురళీమోహన్ తెలిపారు. సాగర్ అధికారులు శివన్నారాయణ, రసూల్, పంచాయతీ కార్యదర్శి ఏడుకొండలు ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి భార్గవి

పొదిలి రూరల్: ప్రతి ఒక్కరు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పొదిలి జూనియర్ సివిల్ జడ్జి ఎస్ భార్గవి పేర్కొన్నారు. శక్రవారం పొదిలి మండలంలోని కుంచేపల్లి గ్రామంలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ.. కోర్టు కేసుల విషయంలో ఇబ్బంది పడుతున్నవారికి ఉచిత న్యాయ సహాయం అందిస్తున్నట్లు చెప్పారు. మహిళల రక్షణ కోసం రూపొందించిన చట్టాల గురించి వివరించారు.

విద్యార్థుల వివరాలు ఆన్‌లైన్ చేయాలి

పుల్లలచెరువు: ప్రైవేట్ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎంఈఓ శామ్యూల్‌జాన్ సూచించారు. శుక్రవారం కాంప్లెక్స్ చైర్మన్ ప్రసాద్‌తో కలిసి పీవీపల్లిలోని నలంద ప్రైవేట్ పాఠశాలను ఎంఈఓ సందర్శించారు. ఎంఈఓ మాట్లాడుతూ.. పాఠశాలలో చదువుతున్న ఎల్‌కేజీ, యూకేజీ విద్యార్థుల వివరాలను తప్పనిసరిగా చైల్డ్ ఇన్ఫో యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. విద్యార్థులకు సరైన మౌలిక వసతులు కల్పించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు.